స్కెచ్

# స్వాగతం

ద్వివేదుల సోమనాథ శాస్త్రి




"ఓహో...స్వయంప్రభగారా! రండి రండి. హలో...చంద్రంగారుకూడా వచ్చారే?" అని షాపువాడు పలకరించాడు.

"ప్రతి నెలా ఉన్నదేకదా...ఇదుగో లిస్టు. ఈ వస్తువులు ఇంటికి పంపించేయండి" అన్నారు ఆ ఇద్దరూ.

షాపు యజమాని ఆ లిస్టు చూసి, "బబుల్ టూత్ పేస్ట్...నిర్మా డిటర్జెంట్ పౌడర్...సబ్బులూ...లైఫ్‌బాయ్ సబ్బులూ...లూజ్ కొబ్బరినూనె, లూజ్ కాఫీపొడి, లూజ్ టీపొడి...

ఏమిటండీ? ఎప్పుడూ క్లోజప్ టూత్‌పేస్టూ, సర్ఫ్ డిటర్జెంట్లూ, పియర్స్ సబ్బులూ, వాటికా హెయిర్ ఆయిలూ, బ్రూ కాఫీ, తాజ్‌మహల్

టీ....తీసుకునేవారు కదా. ఈసారి అన్నీ తక్కువరకాలవి తీసుకుంటున్నారు?"

"ఈసారినుండీ ఇవే పంపిస్తూ ఉండండి. కొంచెం పొదుపు చేద్దాం అని అనుకుంటున్నాం."

"మీకేం తక్కువండీ...ఇద్దరూ జీతాలు తెచ్చు కుంటున్నారుకదా?"

"అయితే మాత్రం...మా ఖర్చులు మా కుంటాయి. అన్నీ ప్రియం అయిపోతున్నాయి కదా!"

"మంచిదే...మీ ఇష్టం. అలాగే పంపుతాను లెండి."

***

అక్కడనుండి స్వయంప్రభ, చంద్రం...ఇద్దరూ బియ్యం, పప్పులషాపుకి వెళ్లారు.

"అక్కుళ్లు అరబస్తా పంపండి. కందిపప్పు, పెసరపప్పు, మినపప్పు ఒక్కొక్క కేజీ. మిగతావి ఈ లిస్టులో ఉన్నట్టు పంపండి." ఆర్డర్ ఇచ్చారు.

"అదేమిటి...ఎప్పుడూ మీరు నరసన్నపేట సన్నాలూ, పప్పులు రెండేసి మూడేసి కిలోలు పంపమనేవారు. మిగతావికూడా సగానికి సగం తగ్గించేశారు. ఎక్కడికైనా కాంపు వెళుతున్నారా?"

"అదేం లేదండి. ఈ నెలనుండి అలాగే పంపండి. కాస్త పొదుపు చేద్దాం అనుకుంటున్నాం. అంతే."

"మంచిదే. అలాగే పంపుతాను."

వాళ్లిద్దరూ ఎప్పుడూ కొనే పండ్ల దుకాణం పక్కనుండి వెళ్లిపోతూంటే, "ఏమండీ! ఈరోజు పండ్లేమీ తీసుకోకుండానే వెళ్లిపోతున్నారు?!" అని అడిగాడు దుకాణంవాడు.

"ఇవాళ వద్దులే" అని వెళ్లిపోయారు.

తర్వాత పాల బూతు దగ్గరకు వెళ్లి, "రేపటినుండి అయిదు రూపాయల పాకెట్లు నాలుగే పంపండి."

"అదేమండీ...ఆరూ ఏభైవి మూడు లీటర్లు తీసుకునేవారు కదా."

"తగ్గించుకుందా మనుకుంటున్నాం. అంతే."

"సరేలెండి."

***

ఆ షాపులవా ళ్లందరూ ఈ మార్పు చూసి కాస్త ఆశ్చర్యపోయారు.

"కూరలు కొనుక్కు వెళ్లిపోదామా?" అనడిగాడు చంద్రం.

"ఎల్లుండి సంతకదా...చవగ్గా ఉంటాయి. అప్పుడు తెస్తే సరి. రేపొక్కరోజుకు లేకపోయినా ఫర్వాలేదు" అన్నది స్వయంప్రభ.

"అవును." తలూపాడు చంద్రం.

"రేపటినుండి మనం ఆఫీసుకు వెళుతున్నప్పుడే హోటల్లో టిఫిన్ చేసి వెళ్లిపోదాం."

"అలాగే చేద్దాం."

ఇలా అనుకుంటూ ఇద్దరూ ఇంటికి రాగానే ఎదురుగా కేబుల్ టీవీ మనిషి కనబడి, "మీరు చెప్పినట్టుగానే కేబుల్ కనెక్షన్ తీసేశాను, మేడమ్!"అని చెప్పి వెళ్లిపోయాడు.

"పిల్లల చదువులు పాడవుతున్నాయని తీసేయమని నేనే చెప్పానండీ."

"అవునవును...మంచిపనే చేశావు."

***

ఆ మర్నాడే రిటైర్ అయిన మామగారూ, అత్తగారూ వంతు ప్రకారం వాళ్లింట్లో ఉండడానికి వచ్చారు. ■

